సాక్షి
చిత్తూరు
మంగళవారం । 6 । జూన్ । 2023



రసవత్తరం చంద్రగిరి ఐపీఎల్

చంద్రగిరి ఐపీఎల్‌లో మండల స్థాయి పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో రాయల్‌ఫైటర్స్ విజేతగా నిలిచింది. - 8లో



స్పందన అర్జీలకు పరిష్కారం

కలెక్టరేట్ సోమవారం నిర్వహించిన స్పందనకు జిల్లా వ్యాప్తంగా 292 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	39	28
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	29

కంచె దాటించిన తూటాలు

తమిళనాడు అటవీ అధికారులు రబ్బరు తూటాల వర్షం కురిపించడంతో ఏనుగులు కౌండిన్య ఎలిఫెంట్ శ్యాంక్చురీని దాటి గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇక్కడ పంటల రుచి మరిగిన గజరాజులు వాటి కోసం కొత్త మార్గాలు అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, కందకాలను పూడ్చి పొలాల్లోకి చొరబడుతున్నాయి.

- తమిళనాడులో రబ్బరు తూటాల వర్షం
- కౌండిన్యలో దారి తప్పుతున్న ఏనుగులు
- కర్ణాటక, తిరుపతిలోకి ప్రవేశించిన గజరాజులు



తాజాగా కర్ణాటకలోని గ్రామాల వైపుకొచ్చిన ఏనుగులను అడవిలోకి మళ్లిస్తున్న స్థానికులు, ట్రాకర్స్

పలమనేరు: జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు గందరగోళానికి గురవుతున్నాయి. ఇప్పటిదాకా ఏనుగులకు సురక్షిత ప్రాంతంగా ఉన్న కౌండిన్య అడవిని దాటి బయటకొస్తున్నాయి. తమిళనాడులోని అటవీశాఖ ఏనుగుల కట్టడికోసం రబ్బరు బుల్లెట్లను వాడుతోంది. దీంతో బెదిరిపోతున్న ఏనుగులు ఇప్పటిదాకా సంచరించిన మార్గాలను వదిలి కొత్తమార్గాల్లోకి వెళుతున్నాయి. తాజాగా ఏనుగులు తోటకనుమ బీట్ మీదుగా కర్ణాటకలోని ముళబాగిలు తాలుకా గ్రామాల్లోకి వెళ్లి కలకలం సృష్టించాయి. ఇప్పటివరకు ఏనుగులను చూడని ఆ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. మరోవైపు మొగిలి ఘాట్‌ను దాటి తిరుపతి జిల్లాలోకి ఏనుగులు వెళతున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఉండాల్సిన ఏనుగుల గుంపులు ఇప్పుడు దారి తప్పడంపై వాటిని ఎలా కట్టడి చేయాలో స్థానిక అటవీశాఖకు దిక్కు తోచడం లేదు. మరోవైపు కొత్తమార్గాల ద్వారా వచ్చే గజరాజులు ఎప్పుడు ఏ గ్రామంలోకి వస్తాయోనన్న భయంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమని కాలం వెళ్లదీస్తున్నారు.

అసలు సమస్య ఇది

పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఉంది. ఈ కౌండిన్య అభయారణ్యంలోనే స్థిరంగా గుంపులుగా సంచరించే ఏనుగులు 106 వరకూ ఉన్నాయి. ఇవన్నీ మూడు దశాబ్దాల క్రితం తమిళనాడు అడవులనుంచి ఇక్కడికి వచ్చి చేరినవే. దీంతో అప్పటి ప్రభుత్వం 1984లో ఇక్కడ కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని ఏర్పాటు చేసింది. ఇందులోకి తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్‌నుంచి 16 వరకు ఏనుగులు కౌండిన్యలోకి వచ్చి వెళుతుంటాయి. కౌండిన్య పడమటి వైపునున్న కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు వస్తున్నాయి. మన రాష్ట్ర సరిహద్దు నుంచి ఇక్కడి ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగులను తమిళనాడుకు మళ్లిస్తే అక్కడి అటవీశాఖ వాటిని తిరిగి ఇక్కడికి మళ్లిస్తోంది. దీనికి తోడు ఏనుగులను బెదిరించేందుకు అవి మళ్లీ అక్కడికి వెళ్లకుండా రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరుపుతున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఏనుగులు భయంతో ఘీంకారాలు చేస్తూ ఎక్కడికి పోవాలో తెలియక కంచె దాటి కొత్త మార్గాల్లోకి వెళుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తూ అడ్డొచ్చిన జనంపై విరుచుకుపడుతున్నాయి. అడవిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బంగారుపాళెం మండలం నుంచి కుప్పం వరకు 130 కి.మీ మేర సోలార్ ఫెన్సింగ్‌ను, 40 కి.మీ మేర ట్రెంచిలను ఏర్పాటు చేసింది. అయితే ఏనుగులు ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, ట్రెంచిలను పూడ్చి మరీ అడవిని దాటి వస్తున్నాయి.

రబ్బరు తూటాల వల్లే..

ఇప్పటిదాకా కౌండిన్యలోనే ఏనుగులుండేవి. కొత్త రుచులు మరిగిన కొన్ని గుంపులు పలమనేరు, కుప్పం రేంజిల్లో అడవిని దాటేవి. కానీ తమిళనాడు అటవీ అధికారులు ఏనుగులపై రబ్బర్ బుల్లెట్లతో కాల్చడంతో అవి బెదిరిపోయి భయంతో కొత్త మార్గాల్లోకి వెళుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని కట్టడి చేయడం ఎలిఫెంట్ ట్రాకర్లకు కష్టంగా మారింది.

– నయూమ్ అలీ, ఎఫ్ఆర్వో, పలమనేరు

పంటల రుచి మరిగిన ఏనుగులు

అడవిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వీటికి మేత ఉంది. కౌండిన్య నదిలో నీరుండడంతో దాహానికి ఇబ్బంది లేదు. ఒక్కో ఏనుగుకు రోజుకు 900 లీటర్ల నీరు, 10 హెక్టార్లలో ఫీడింగ్ అవసరముంది. ఏనుగులు రోజుకు పదిమైళ్ల వరకు సంచరిస్తుంటాయి. అడవిలోని వెదురు, బెరడు వీటి ప్రధాన ఆహారం. కానీ అడవిని దాటి రైతుల పంటలైన చెరుకు, వరి, రాగి, అరటి, మామిడి, టమాటా లాంటి పంటలను రుచి చూసిన ఏనుగులు అడవి నుంచి తరచూ పొలాల్లోకి మేతకోసం వచ్చేస్తున్నాయి.

కొత్తదారుల్లోకి వెళుతున్న వైనం

వారం రోజుల క్రితం కౌండిన్యలోని 16 ఏనుగుల గుంపు తోటకనుమ బీట్ మీదుగా కర్ణాటకాలోని ముళబాగిలు తాలూకా పరిధిలో సంచరించాయి. పలు పంటలను తొక్కి నాశనం చేశాయి. ఇప్పటిదాకా ఏనుగులను చూడని అక్కడి జనం హడలిపోయారు. వాటిని తరిమేందుకు బాణాసంచా పేల్చారు. పాతటైర్లను కాల్చి వాటిపైకి విసరడంతో ఆగ్రహం చెందిన ఏనుగులు జనంపైకి తిరగబడ్డాయి. ఇక కౌండిన్యకు తూర్పు వైపున్న ఏనుగులు మొగిలి ఘాట్‌ను దాటి బంగారుపాళెం, గుడిపాల, సోమల, చంద్రగిరి మీదుగా శేషాచలం అడవుల్లోకి వెళుతున్నాయి. కౌండిన్యలోని ఏనుగులు దారి తప్పడంతో అటు గజరాజులకు, ఇటు జీవజాలానికి ప్రాణగండం తప్పడం లేదు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

పోస్టర్ల ఆవిష్కరణ



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెనుమూరు మండలం పులిగుండు వద్ద నిర్వహించే జగనన్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రవాస భారతీయ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డితో కలిసి జగనన్న మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 7న జగనన్న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవాస భారతీయ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 21 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. 2,500 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 73370 30956, 99493 35990 నంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న బోధన, ప్రత్యేక బోధన అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు చిత్తూరులోని ఎంప్లాయ్‌మెంట్ భవనంలో ఉండే డీసీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 8న జిల్లా కేంద్రంలో ఉండే అంబేడ్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో డెమో తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

న్యూస్‌రీల్

శాంతి నారాయణకు 'రెడ్డెమ్మ పురస్కారం'

చిత్తూరు రూరల్: ఏటా అందించే 'కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారానికి ఈ సారి శాంతి నారాయణ ఎంపికయ్యారు. ఈ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానించగా, 25 నవలలు వచ్చాయి. అందులో శాంతినారాయణ రాసిన ముడి (స్త్రీ ఆత్మగౌరవం) నవల ఎంపికైంది. ఈ నెల 12వ తేదీన చిత్తూరులో జరిగే సాహిత్య సభలో ఆయనకు ఈ పురస్కారం అందించనున్నట్లు నిర్వాహకురాలు రామలక్ష్మి తెలిపారు.

బాధ్యతతో పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓ) బాధ్యతగా వ్యవహరించాలని డీఐఓ రవిరాజు, డీపీఎంఓ శ్రీనివాసరావ్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని జిల్లాప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం సీహెచ్ఓలకు పరిశుభ్రతకు సంబంధించిన ఐదు అంశాలపై మూడవ విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలని, శిక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు.

వరసిద్ధునికి రూ.1.62 లక్షల విరాళం



విరాళాన్ని ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి రూ.1.62లక్షలు విరాళం అందింది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డికి జిల్లాకు చెందిన పోద్దిశెట్టి సురేష్ కుటుంబ సమేతంగా సోమవారం స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. స్వామివారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.99,500, గో సంరక్షణ ట్రస్టుకు రూ.62,900 విరాళంగా చెల్లించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఏఈల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖలో ముగ్గురు ఏఈలు బదిలీ అయ్యారు. చిత్తూరు ఏఈ హరిదీప్తి చిత్తూరు డివిజన్ కార్యాలయానికి బదిలీ కాగా ఆ స్థానంలో పెనుమూరు ఏఈ పవన్‌ను నియమించారు. బంగారుపాళెం ఏఈ శ్రీధర్ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు.


పీఏసీఎస్ పెట్రోల్ బంక్‌లో ఆప్కాబ్ ఎండీ



పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న ఆప్కాబ్ సిబ్బంది

నగరి : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం (పీఏసీఎస్) ద్వారా నిర్వహించే పెట్రోల్ బంక్‌ను సోమవారం ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి సందర్శించారు. బంక్ నిర్వహణ తీరు, వ్యాపార లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 76 సంఘాలలో నగరి పీఏసీఎస్ తొలిసారిగా హెచ్‌పీ పెట్రోల్ బంకు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘంలో చేపట్టే ఎరువులు, వరివిత్తనాలు, పురుగుల మందుల అమ్మకాలు, బంగారు ఆభరణాలకు రుణాలు ఇచ్చే తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాసులురెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో మనోహర్ గౌడ్, ఆప్కాబ్ మేనేజర్ ప్రసాద్, పీసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, డైరెక్టర్ దామునాయుడు, బ్రాంచి మేనేజర్ సందీప్, సూపర్‌వైజర్ ఆనంద్, సీఈవో తులసి పిళ్లె, సిబ్బంది గుణశేఖర్, తనికాచలం, శేఖర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీఎంగా హరీష్



హరీష్

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు తిరుపతి ఇండియన్ బ్యాంకు జోనల్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి నెల్లూరు ఎల్‌డీఎంగా పనిచేస్తున్న ఎ.హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి



ఫ్యాక్టరీ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న ప్రజాప్రతినిధులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

తవణంపల్లె: పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు అపారమైన ఉపాధి అవకాశాలు కలుగుతాయని రాజంపేట ఎంపీ పీవి మిథున్ రెడ్డి అన్నారు. మండలంలోని గాజులపల్లె సమీపంలో సోమవారం పారిశ్రామిక వేత్త జి.ప్రకాష్‌రెడ్డి నూతనంగా నిర్మించిన జీసీఆర్ ఫుడ్ అండ్ బెవరేజస్ ఫ్యాక్టరీ శిలాఫలకాన్ని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్. బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఫ్యాక్టరీ యూనిట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఫ్యాక్టరీలో జ్యోతి ప్రజ్వలన, పూజలు చేసి స్విచ్ ఆన్ చేశారు. అధునాతన పరికరాలను, ల్యాబొరేటరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో అటవీశాఖ అధికారుల సమక్షంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీ మిథున్ రెడ్డి ప్రసంగిస్తూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఫ్యాక్టరీ యజమాని, పారిశ్రామికవేత్త ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు లేక బాధపడుతున్న రైతులను ఆదుకోవడానికే జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు, వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, చిత్తూరు నగర మేయర్ అముద, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎస్పీ రిషాంత్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోనల్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కాణిపాకం ట్రస్టు బోర్డు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేష్, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో బాబు ఓటమి తథ్యం

కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు ఓటమి తథ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి జోస్యం చెప్పారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు వణుకుపుట్టి పొత్తుల కోసం పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులిలాంటి వారని, ఆయన ఎవ్వరితో పొత్తులేకుండానే వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి అధికారం కైవసం చేసుకోవడం ఖాయమన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ , ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 11వ తేదీ (ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి, ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 11వ తేదీ(ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు తిరుపతిలోని Mahati Auditorium, Balaji Colony, Near Town Club నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

లెజెండరీ ఫ్యాకల్టీతో..

ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజెండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్‌టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజెండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు.. అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 11, 2023 (ఆదివారం)
వేదిక : Mahati Auditorium, Balaji Colony, Near Town Club, Tirupati.
సమయం : ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

పర్యావరణాన్ని కాపాడుకుందాం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాన్స్‌కో కార్యాలయ సిబ్బంది



మొక్క నాటుతున్న జస్టిస్ కరుణకుమార్

చిత్తూరు కార్పొరేషన్: రోజువారి జీవన శైలిలో కొద్ది మార్పులు చేసుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జేసీ శ్రీనివాసులు, డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గాంధీ విగ్రహం నుంచి నగరవనం వరకు పాదయాత్ర, సైకిల్ ర్యాలీని అటవీశాఖ, కాలుష్య నివారణ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. సైకిల్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఎఫ్ఓలు, ప్రకృతి ప్రేమికులు పాల్గొనగా కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రోజు కొంత సమయం పర్యావరణ పరిరక్షణకు కేటాయించాలని సూచించారు. జీవనశైలి లైఫ్ మిషన్ ద్వారా గత 15 రోజుల్లో జిల్లాలోని 36 వేల మందికి పర్యావరణంపై అవగాహన కల్పించినట్లు వివరించారు. అనంతరం నగరవనంలో మొక్కలు నాటి, స్టాల్స్‌ను సందర్శించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని మేయర్ అముద తెలిపారు. కార్యక్రమంలో సోషల్ ఫారెస్టు డీఎఫ్ఓ సోమశేఖర్, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఎఫ్ఆర్వోలు థామస్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నగరవనంలో..

స్థానిక నగరవనంలో సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ మొక్కలు నాటి మాట్లాడారు. అడవి జంతువులను వేటాడటం, చెట్లను నరకడం నేరమన్నారు. జీవనశైలిలో చేసుకుంటూ ప్రకృతితో కాసేపు గడపాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో పరిధిలో..

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. స్థానిక ఈఈ కార్యాలయంలో సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ లోకేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో ఆదిపురుష్ ప్రీ రిలీజ్ ఈవెంట్

సాక్షి, తిరుపతి: పాన్ ఇండియా చిత్రం ఆదిపురుష్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ మంగళవారం సాయంత్రం నగరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్వీయూ సమీపంలోని తారక రామా స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. రామాయణ కథతో రూపొందించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను శ్రీవారి పాదాల చెంత నిర్వహించేందుకు శ్రేయాస్ మీడియా ఆధ్వర్యంలో సన్నాహాలు పూర్తి చేశారు. ఈ చిత్రంలో హీరో ప్రభాస్ శ్రీరాముడుగా, హీరోయిన్ కృతి సనన్ సీతగా, సైఫ్ అలీఖాన్ రావణుడుగా, దేవదత్ నాగ్ హనుమంతుడిగా నటిస్తున్నారు. ఈనెల 16వ తేదీన అన్ని భాషల్లో విడుదల కానుంది. ఈమేరకు తిరుపతిలో జరగనున్న ప్రీ రిలీజ్ కార్యక్రమానికి హీరో ప్రభాస్, హీరోయిన్ కృతి సనన్, ఇతర నటీనటులు హాజరు కానున్నారు. ప్రత్యేక అతిథిగా చిన్నజీయర్‌స్వామి రానున్నట్లు తెలుస్తోంది.



ముస్తాబైన తారాకరామా స్టేడియం

చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసుశాఖలో గత నెల 15వ తేదీన మహిళ హోంగార్డు హరిత మృతి చెందారు. ఈ మేరకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి హోంగార్డు ఫండ్ నుంచి రూ.4 లక్షల చెక్కును అందజేశారు. శాఖ తరఫున అన్ని విధాలుగా ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డు యూనిట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురుగేష్ జనవరి 3న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో కారుణ్య నియామకం కింద ఆయన భార్య సుమితకు సీ కేటగిరిలో ఉద్యోగ అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్ పాల్గొన్నారు.

రసవత్తరంగా చంద్రగిరి ఐపీఎల్

- చిన్నగొట్టిగల్లు మండలం విజేత భాకరాపేట
- విజేతలకు ట్రోఫీలు బహూకరించిన జేసీ బాలాజీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



దిగవూరు జట్టుకు రన్నర్స్ ట్రోఫీ అందిస్తున్న జేసీ బాలాజీ, మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లు మండల విజేతగా నిలిచిన భాకరాపేట జట్టుకు ట్రోఫీ, నగదును అందిస్తున్న జేసీ బాలాజీ, టోర్నమెంట్ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలస్థాయి పోటీలు చివర దశకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన చిన్నగొట్టిగల్లు మండల ఫైనల్స్ మ్యాచ్‌లో భాకరాపేట జట్టు దిగవూరుజట్టుపై గెలుపొందింది. రామచంద్రాపురం, చంద్రగిరి, ఎర్రావారిపాళెం మండలాల జట్లు సైతం ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

విజేతగా రాయల్ ఫైటర్స్

చిన్నగొట్టిగల్లు మండల స్థాయి ఫైనల్స్ పోటీల్లో రాయల్‌ఫైటర్స్ జట్టు(భాకరాపేట), ఎస్ఎస్‌కే (దిగవూరు) జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఫైటర్స్ జట్టు 15 ఓవర్లకు 84 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్‌కే జట్టు 74 పరుగులు చేసి ఓటమిపాలైంది. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా జీవన్ కుమార్, బెస్ట్ బౌలర్‌గా గుణశేఖర్, బెస్ట్ ఆల్ రౌండర్‌గా గిరీష్ కుమార్ నిలిచారు.

ట్రోఫీల బహూకరణ

విజేతగా నిలిచిన రాయల్ ఫైటర్స్, రన్నర్స్ దిగవూరు ఎస్ఎస్‌కే జట్లకు జేసీ బాలాజీ, టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ట్రోఫీలను అందించారు. మొదటి బహుమతిగా రాయల్‌ఫైటర్స్‌కు రూ.లక్ష, దిగవూరు ఎస్ఎస్‌కే జట్టుకు రూ.75 వేలు, 3వ స్థానంలో నిలిచిన చిన్నగొట్టిగల్లు సీఎస్‌కే జట్టుకు రూ.50వేలు, 4వ స్థానంలో ఎగువూరుకు చెందిన బాబీ ఎలెవన్స్ జట్టుకు రూ. 25 వేలు బహుమతులను జేసీ బాలాజీ, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

తహసీల్దార్ పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ అయిన స్థానం
ఇన్బనాథన్	జీడీ నెల్లూరు	పాలసముద్రం
బాబు	పాలసముద్రం	జీడీ నెల్లూరు
చిట్టిబాబు	యాదమరి	తవణంపల్లి
హనుమంతు	పెద్దపంజాణి	యాదమరి
లోకేశ్వరరావ్	శాంతిపురం	పెద్దపంజాణి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న పలు కేడర్ల ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు శాంతిపురం తహసీల్దార్ లోకేశ్వరరావు స్థానంలో అక్కడే పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కాలేశ్‌ను ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా నియమించారు. ఐదుగురు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లను చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న కళావతిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆమె చిత్తూరు కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకున్న అనంతరం తదుపరి పోస్టింగ్ ఇవ్వనున్నారు. పలువురు సిబ్బందిని బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

2న చెస్ టోర్నమెంట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మురుగానిపల్లిలో ఉన్న న్యూయార్క్ స్కూల్లో జూలై 2న చదరంగం రాష్ట్ర స్థాయి ఓపెన్ రాపిడ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆ పోటీల పోస్టర్లను సోమవారం న్యూయార్క్ పాఠశాల వైస్ చైర్మన్ శ్రీధర్, పోటీల నిర్వాహకులు ఆవిష్కరించారు. చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ చదరంగం విద్యార్థుల్లో మేధోసంపత్తిని పెంపొందిస్తుందన్నారు. క్రీడల్లో చదరంగానికి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు.

చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీగా రఘువీర్ విష్ణు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రఘువీర్ విష్ణును నియమిస్తూ ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు ఎస్సీ, ఎస్టీ విభాగం డీఎస్పీగా పనిచేస్తున్న రఘువీర్ విష్ణుకు అదనంగా ట్రాఫిక్ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కేజీబీవీ దరఖాస్తులకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ) పాఠశాలల్లో పోస్టుల భర్తీకి గడువు పొడిగించారని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో బోధనా సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు రాష్ట్ర అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారన్నారు. రాష్ట్ర స్థాయిలో పోస్టుల కసరత్తుకు పలువురు అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తులను పూర్తి చేయలేకపోయారన్నారు. అటువంటి అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ వరకు గడువు పొడగిస్తున్నట్లు రాష్ట్ర అధికారులు వెల్లడించారన్నారు.

బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వతేదీ నుంచి 25 వతేది లోపు దరఖాస్తులను డిప్యూటీ కమిషనర్ కర్నూలు కార్యాలయంలో అందజేయాలన్నారు. పాలక మండలిలో మొత్తం 11 మంది సభ్యులుంటారు. వారిలో సగం మహిళలకు కేటాయించనున్నట్లు చెప్పారు. మిగిలిన 50 శాతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారికి కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుచేసుకొనే వారు 30 ఏళ్ల వయస్సు పైబడిన వారు అర్హులని, దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు బోయకొండ ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వెటర్నరీకి 31వ ర్యాంక్



శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి ఎడ్యుకేషన్: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో స్థానిక శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ముందంజ వేసింది. గత ఏడాది కన్నా 33 ర్యాంకులు మెరుగుపరుచుకొని 31వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం 64వ ర్యాంకు పొందగా ఈ ఏడాది 31వ ర్యాంకుకు సొంతం చేసుకుంది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ సంస్థ దేశంలోని వివిధ విశ్వ విద్యాలయాల పనితీరును పరిశీలించి ప్రతి ఏటా ర్యాంకులు ఇస్తుంది. 2023వ సంవత్సరానికి సోమవారం ర్యాంకులు ప్రకటించింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 40 అత్యుత్తమ ర్యాంకులు ప్రకటించగా అందులో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ 31వ ర్యాంకు పొందడం విశేషం. బోధన, పరిశోధన, విస్తరణ, ప్లేస్‌మెంట్స్ ఆధారంగా ఇచ్చే ఈ ర్యాంకింగ్స్‌లో వెటర్నరీ మంచి ర్యాంకు సాధించింది. 100 మార్కులకు 43.83 మార్కులు సాధించింది.

మూడేళ్ల ప్రస్థానం

వెటర్నరీయూనివర్సిటీ గత మూడేళ్లుగా బోధన, పరిశోధన రంగాల్లో పురోగతి సాధించింది. ముఖ్యంగా దేశీయ ఆవుల పునరుత్పత్తికి, ఆ జాతి ఆవుల అభివృద్ధికి ఎంబ్రియోట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ ప్రవేశపెట్టింది. టీటీడీ సహకారంతో పరిశోధన ప్రాజెక్ట్ ప్రారంభించి గిర్, దేశీయ ఆవు జాతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అలాగే టీటీడీ సహకారంతో గో సంరక్షణశాలలో ఫీడ్ అండ్ ఫాడర్ (దాణా) తయారీ ప్రాజెక్ట్ నిర్వహిస్తోంది. ఒంగోలు, పుంగనూరు ఆవుల అభివృద్ధికి పరిశోధనలు చేస్తోంది. ఇక్కడ యూజీ కోర్సులు పూర్తి చేసిన వారు మెరుగైన ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. దీని వల్ల మెరుగైన ర్యాంకు సాధ్యమైంది.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

ఏర్పేడు : మండలంలోని మేర్లపాక వద్ద ఈ నెల 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న చిన్నారి భాన్వి తాక్షరి సోమవారం మృతి చెందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం చిన్నారి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

భార్య గొంతుకోసిన భర్త



బాధితురాలు రేఖ

చౌడేపల్లె: కుటుంబ కలహాల కారణంగా భర్త ఆవేశంతో భార్య గొంతు కోసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లె మండలం తీర్లాకుప్పంకు చెందిన రేఖకు చౌడేపల్లె మండలం గోసల కురప్పల్లెకు చెందిన జి.నాగరాజుకు సుమారు 10 యేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల వీరి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ నెల 3వతేదీ శనివారం తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటిలో నిద్రిస్తున్న నాగరాజును హత్యచేయడానికి యత్నించారు. ప్రతిఘటించిన నాగరాజ ప్రమాదం నుంచి తప్పించుకోగా వారు పరారయ్యారు. పరారైన వ్యక్తులు తన భార్య రేఖతో సన్నిహితంగా ఉందన్న చర్చ మొదలైంది. ఈ క్రమంలో గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టారు. ఇంతలో నాగరాజ తనపై దాడిచేసిన వారితోపాటు భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందరూ పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకున్నారు. అందరూ మాట్లాడుతుండగా నాగరాజ కత్తితో రేఖ గొంతు కోశాడు. గుర్తించిన బంధువులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవలకోసం మదనపల్లెకు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ రవికుమార్‌ను విచారించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు ఎందుకు పరిష్కరించరు?



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యలు పరిష్కరించే అవకాశం తహసీల్దార్లకు ఉన్నప్పటికీ ఎందుకు పరిష్కరించరని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టరేట్ అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కొందరు తహసీల్దార్ల పరిధిలో చేసే పనులను చేయడం లేదని మండిపడ్డారు. తహసీల్దార్లు చేయవలసిన పనులను మాత్రమే చేయమని చెబుతున్నామని అన్నారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను ప్రాధాన్యతగా భావించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని తెలిపారు. రామకుప్పం, వి.కోట మండలాలకు సంబంధించి ఎక్కువ సమస్యలపై అర్జీలు వస్తున్నాయన్నారు. సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

7న కుప్పంలో రెవెన్యూ సదస్సు

నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 7న కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు జేసీ శ్రీనివాసులు వెల్లడించారు. ప్రతి బుధవారం ఒక్క నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జేసీ ఆదేశించారు.

పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలి



జేడీ సర్వీసెస్ మువ్వారామలింగానికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చేయకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రావణ్ కుమార్, బాలాజీ కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగానికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న టీచర్ల బదిలీల కసరత్తులు ఎక్కువ సంఖ్యలో ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల టీచర్లకు అన్యాయం కలుగుతోందన్నారు. ఖాళీలను బ్లాక్ చేయకుండా బదిలీలు నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. బదిలీల ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు వారు తెలిపారు.

స్పందన అర్జీలకు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదయ్యే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు అర్జీలను స్పందనలో అందజేశారు. అన్ని శాఖలకు సంబంధించి 292 అర్జీలు నమోదయ్యాయి. వాటిని ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్, జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో వినతులను స్వీకరించారు. పలు శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

- గుడిపాల మండలం గట్రాళ్లమిట్ట ఎస్సీ కాలనీలో నివాసం వద్ద ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ స్తంభాలను తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు వినతిపత్రం అందజేశారు.
- తమ గ్రామానికి కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు కుట్ర చేశారని మాపాక్షి హెచ్‌డబ్ల్యూ-2 కాలనీ వాసులు స్పందనలో ఫిర్యాదు చేశారు.

పరిహారం చెక్కు అందజేత



బాధితులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: కుప్పం ప్రాజెక్ట్ పరిధిలోని గుల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల జరిగిన ఘటనకు పరిహారం చెక్కును అందజేశారు. ఆ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు తిని చిన్నారి దీక్షిత మృతి చెందిందనే వార్త ఓ దినపత్రికలో ప్రచురితమైంది. ఆ శీర్షికను కర్నూలు హ్యూమన్ రైట్స్ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. మృతి చెందిన దీక్షిత కుటుంబీకులకు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో చిన్నారి కుటుంబీకులు మురుగేష్, సరితకు ఐసీడీఎస్ శాఖ నిధుల నుంచి రూ.8 లక్షల చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు.

విశేష వాహనాలపై శ్రీవారి విహారం



గజ వాహనంపై స్వామివారు

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోరోజు శ్రీవారికి హనుమంత, గజవాహనసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యపూజాకైంకర్యాలు సమర్పించారు. అనంతరం వైకుంఠనాథుని విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఉత్సవర్లకు వసంతోత్సవం జరిపించారు. రాత్రి ప్రసన్న వేకటేశ్వరస్వామివారు గజ వాహనంపై మాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచ్చార్యులు, తిప్పాచ్చార్యులు పాల్గొన్నారు.